నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

నవోదయలో ఘర్షణ.. విద్యార్థికి గాయం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో గురువారం రాత్రి 9వ తరగతి, 11వ తరగతికి చెందిన పలువురి విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రాత్రి భోజనం చేసే సమయంలో ఒకరి స్థలంలో ఒకరు కూర్చోవడంపై విద్యార్థులు గొడవపడ్డారు. ఉపాధ్యాయులు సముదాయించినా వినకుండా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మధ్యలో వెళ్లిన ఇద్దరి ఉపాధ్యాయులకు సల్ప గాయాలయ్యాయి. ప్రిన్సిపాల్ సత్యవతితో పాటు ఉపాధ్యాయుల బృందం సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులకు చదరగొట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి నిజాంసాగర్ ఎస్సై సుధాకర్ బాన్సువాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన 11వ తరగతి విద్యార్థికి ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేసి విద్యార్థులకు తగు కౌన్సిల్ ఇచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు.

బడిలో కీచక ఉపాధ్యాయుడు

- గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తుండగా ఉపాధ్యాయుడి తీరును వెల్లడించిన ప్రైమరీ విద్యార్థులు
- ఫోక్సో చట్టం కింద కేసు నమోదు


గుండారం ప్రవీణ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కీచకంగా మారాడు. అభం శుభం తెలియని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి.. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చాడు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జానకంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదే స్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుండారం ప్రవీణ్.. తమ పట్ల ప్రవర్తిస్తున్న తీరును పలువురు విద్యార్థినులు షీ టీమ్ దృష్టికి తీసుకెళ్లగా.. వారు డీఎస్పీ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం విచారణ చేపట్టగా.. సదరు ఉపాధ్యాయుడి తీరు వెలుగులోకి వచ్చింది.



కోర్టు సముదాయంలో అదనపు భవనాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న జస్టిస్ లక్ష్మీనారాయణ

కేసుల సత్వర పరిష్కారమే
అందరి ధ్యేయం కావాలి

- హై కోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి
- అదనపు కోర్టులను వర్చువల్ విధానంలో ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డి

కేసుల సత్వర పరిష్కారమే అందరి ధ్యేయం కావాలని హై కోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయస్థాన భవనాల వద్ద నూతనంగా నిర్మించి 2వ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం (కోర్టు)ను వర్చువల్ పద్దతిన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేసులు త్వరగా పరిష్కరించడమే తమ ధ్యేయమని, కోర్టులకు వెళితే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కక్షిదారుల్లో కలిగేలా న్యాయ వ్యవస్థ పనిచేయాలని హితవు పలికారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా న్యాయస్థానాల ఏర్పాటు ఆవశ్యకత పెరిగిందని అన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కారం కావాలని, ఏళ్ల తరబడి కేసులు పెండింగులో ఉండడం మంచిదికాదని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన చట్టాలకనుగుణంగా అందరు నడుచుకొని పెండింగు కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. న్యాయ వ్యవస్థకు బార్ - బెంచ్ రెండు చక్రాలంటివని, రెండు సక్రమంగా పనిచేస్తేనే కేసులు సత్వర పరిష్కారమై కక్షిదారులకు న్యాయం చేకూర్చిన వారవుతామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాల్లో ఎస్సి,ఎస్టీ కోర్టు, మరొక సివిల్ కోర్ట్ అవసరం ఉందని అన్నారు.

అనంతరం ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ, న్యాయమూర్తులు కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు హాలు, జడ్జి ఛాంబర్ ను సందర్శించి పూజలు నిర్వహించారు. 2 వ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం జడ్జిగా జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ ఇంచార్జి భాద్యతలు తీసుకుని ఆసీనులయ్యారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.యెన్. శ్రీదేవి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ, అడిషనల్ జిల్లా న్యాయ మూర్తి లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, సూపెరింటెండెంట్లు వెంకట్ రెడ్డి, శ్రీధర్, చంద్రసేన్ రెడ్డి, న్యాయమూర్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ కంపెనీపై
ఎమ్మెల్యే మౌనమెందుకు..?

- కెమికల్ కంపెనీ విషవాయువులతో నింగి, నేల, నీరు కలుషితం
- శ్వాసకోస వ్యాధులకు గురవుతున్న స్థానికులు
- ఫిర్యాదులు, ఆందోళనలు చేసినా పట్టని అధికారులు
- గతంలో ఆందోళనలకు మద్దతు ఇచ్చిన వెంకటరమణారెడ్డి
- ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి స్పందన కరువు

నవతెలంగాణ-భిక్కనూర్

అదో పెద్ద కెమికల్ కంపెనీ. రాత్రి అయిందంటే చాలు.. విషవాయువులను గాల్లోకి వదులుతుండటంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇక చిన్నారులు, వృద్ధులు పడే అవస్థలు అన్నీ ఇన్ని కావు. రోజూ ఇదే తంతు. ఫిర్యాదులు చేసినా, ఆందోళనలు చేపట్టినా పట్టించుకున్న వారే కరువైయ్యారు. వెంకటరమణాణరెడ్డి సైతం గతంలో ఆందోళనల్లో పాల్గొన్నారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలుపొందినా కెమికల్ కంపెనీల విషవాయువుల విడుదలపై స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కామారెడ్డి ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకొని తమకు కెమికల్ కంపెనీ విషవాయువుల నుంచి ఉపశమనం కల్పించాలని భిక్కనూర్ మండల వాసులు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో ఉన్న ఓ పెద్ద కెమికల్ కంపెనీతో మండలంలోని భిక్కనూర్, గుర్జకుంట, సిద్ధ రామేశ్వర నగర్, బస్వాపూర్, పెద్ద మల్లారెడ్డి, మల్లు పల్లి, కాచాపూర్, రామేశ్వర్ పల్లి, అంతంపల్లి, లక్ష్మీ దేవునిపల్లి గ్రామాల వాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాత్రి అయితే చాలు సదరు కంపెనీ నుంచి వెలువడే కెమికల్ వాసనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా కంపెనీ చుట్టుపక్కల గ్రామాలకు కెమికల్ కంపెనీ విషవాయువులు వ్యాప్తి చెందుతుండటంతో ఊపిరాడటం లేదని స్థానికులు వాపోతున్నారు. గత వారం రోజుల నుండి రాత్రి అయితే చాలు కొందరు వ్యక్తులు వాసన భరించలేక ఉండలేకపోతున్నామని కంపెనీ ముందు గొడవలు చేసిన యాజమాన్యం పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు తెలిపారు.

పట్టని ప్రజాప్రతినిధులు

భిక్కనూరు పట్టణ గ్రామ శివారులో ఏర్పాటుచేసిన కెమికల్ కంపెనీ ద్వారా గతంలో సమీపంలో ఉన్నా కాచాపూర్ గ్రామంలోని చెరువులోని చేపలు చనిపోవడంతో గ్రామ ప్రజలు 100 రోజులకు పైగా ధర్నా చేయడంతో అప్పుడు కాంగ్రెస్, బిజెపి నాయకులు, ప్రస్తుత బిజెపి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కాచాపూర్ గ్రామస్తులకు మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, రమణారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినా.. కంపెనీపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఏ ఒక్క ప్రజా ప్రతినిధి సైతం కంపెనీపై ఎందుకు మాట్లాడడం లేదని, గ్రామ ప్రజలు కెమికల్ కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటే ఎందుకు స్పందించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.


ఆందోళన చేపట్టిన గ్రామస్తులు (ఫైల్)



వారికి మద్దతుగా మాట్లాడుతున్న కేవీఆర్

పాలకుల దృష్టికి తీసుకెళ్లినా..

కెమికల్ వాసనతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు కాంగ్రెస్, బిజెపి నాయకులు షబ్బీర్ అలీ, రమణారెడ్డికి దృష్టికి తీసుకెళ్తే.. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారే కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని ఆయా పార్టీల నాయకులు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కంపెనీ నుండి ఎలాంటి గాలి కాలుష్యం లేకున్నా రాత్రి 9 గంటల తర్వాత భరించలేని వాసన కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కంపెనీ యాజమాన్యానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నాము అని చెప్పే ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు భిక్కనూర్ సమీప గ్రామాలు.. కంపెనీ నుండి వచ్చే కెమికల్ వాసన కొరల్లో కొట్టుమిట్టాడుతుంటే ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా కాంగ్రెస్, బిజెపి నాయకులు స్పందించి గాలి, నీరు కాలుష్యం చేస్తున్న కంపెనీపై చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కెమికల్ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ఎన్నికల ప్రచారానికి వచ్చే సమయంలో అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.

హత్యాకేసులో నలుగురికి జీవితఖైదు

చేతబడి చేశారని భావించి

నాలుగేండ్ల క్రితం వివాహిత దారుణ హత్య

నవతెలంగాణ-ఆర్మూర్

చేతబడి చేస్తుండటంతోనే అనారోగ్యానికి గురవుతున్నట్టు భావించి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసి ఘటనలో నిందితులకు జీవితఖైదు విధిస్తూ జిల్లా జడ్జి కుంచాల సునీత శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న బోణికే భారతి (55) 2018.07.08వ తేదీనా దారుణ హత్యకు గురైయ్యారు. మృతురాలి భర్త బోణికే లింగయ్య గారి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ పి. రాఘవేంధర్ నమోదు చేసి ధర్యాప్తు చేసి, లభించిన ఆధారాల ప్రకారం తోకల చిత్ర, బట్టు వెంకటేశ్, పందిర్ల రాజేందర్‌గౌడ్, బట్టు రంజిత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇట్టి కేసులో విచారణ అనంతరం చార్జ్ షీట్ వేయగా కోర్టు సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి సునీత కుంచల శుక్రవారం నేరస్థులకు జీవిత కాలం శిక్ష విధించారు.

మృతురాలి ఇంటి ముందరే తోకల చిత్ర ఇల్లు ఉంటుంది. అయితే మృతురాలు చేతబడి చేయడం వలనే తన ఆరోగ్యం బాగుండటం లేదని భావించిన తోకల చిత్ర.. ఆమెను హత్య చేసేందుకు పన్నాగం పన్నింది. మృతురాలి సమీప బంధువైన బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన బట్టు వెంకటేశ్‌కు విషయం తెలిపి హత్యకు పురమాయించింది. అందుకు బట్టు వెంకటేష్ తన స్నేహితులు అయిన పందిర్ల రాజేంధర్ గౌడ్, బట్టు రంజిత్‌తో కలిసి మధ్యాహ్నం వేళ మృతురాలి ఇంట్లోకి చొరబడి వారి వెంట తీసుకుని పోయిన కత్తితో ఒంటరిగా ఉన్న మృతురాలి గొంతు కోసి హత్య చేశారు. ఆమె చెవులను కూడా కోసి బంగారు ఆభరణాలు, మెడలో ఉన్న చైన్ మొత్తం 24 గ్రాముల బంగారం దొంగిలించుకొని దోపిడీ దొంగలు హత్య చేసినట్టు సృష్టించే యత్నం చేశారు. ఈ కేసులో నేరస్థులకు శిక్ష పడుటకు ముఖ్య పాత్ర వహించిన ఏసిపిజి బస్వారెడ్డి స్టేషన్ హౌస్ ఆఫీసర్, రవి కుమార్, జిల్లా ప్రాసిక్యూటర్ రవిరాజ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిజామాబాద్ కోర్ట్ కానిస్టేబుల్ ఖ.శంకర్. శ్రీకాంత్ గౌడ్ రాజేశ్వర్ , పోచయ్య, లను జిల్లా కమీషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ అభినందించారు.

మైనర్‌తో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురి అరెస్ట్

నవతెలంగాణ-కామారెడ్డి


నిందితుల అరెస్ట్

మైనర్‌తో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గిరిని అరెస్ట్ చేసినట్టు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలో తల్లి తండ్రులు లేని ఒక మైనరు బాలికను.. ఆమె చిన్నమ్మ వద్ద నుండి డబ్బులకు కొనుగోలు చేసి, ఆ అమ్మాయిని బలవంతంగా, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వ్యభిచారం చేయిస్తున్నారు. ఆమెను హింసిస్తూ వ్యభిచారం చేయించి, వచ్చిన డబ్బులను తీసుకొని జీవనం సాగిస్తున్న భీంగల్, (మక్కల) సంపంగి లక్ష్మి ఆమెతో సహజీవనం చేస్తున్న సుంకరి శంకర్‌తో పాటు వీరికి సహకరిస్తూ తన శ్రీనివాస లాడ్జి (బస్ స్టాండ్ దగ్గర)లో వ్యభిచారం కొనసాగిస్తున్న లాడ్జ్ ఓనర్ నరసింహారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

కామారెడ్డి పట్టణంలో వ్యభిచారం చేయించి, డబ్బులను సంపాదిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి, వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పట్టణంలో ఉన్న అన్ని లాడ్జ్‌ల యజమానులకు, హెూటల్‌ల వారు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాలుపడవద్దని, అలా చేసిన వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అట్టి సముదాయాలను శాశ్వతముగా మూసివేస్తామని స్పష్టం చేశారు. చుట్టూ జరుగుతున్న అనైతిక కార్యక్రమాలపై పట్టణ ప్రజలు స్పందించి పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

దేశ గతిని మార్చేది.. ఓటు హక్కు

- వజ్రాయుధం లాంటి ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

దేశ గతిని మార్చేది.. ఓటు అని ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని, అది మీ చేతిలో ఉందని , ఓటు ప్రాముఖ్యతను గుర్తెరిగి మే 13 న జరగబోయే పార్లమెంటు ఎన్నికలల్లో తప్పక ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం వాక్ టు పోలింగ్ స్టేషన్ లో భాగంగా తక్కువ శాతం ఓటింగ్ నమోదైన కామారెడ్డి పట్టణంలోని వడ్డెర కాలనీలోని 214వ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో 50-51 శాతం మేర ఓటింగ్ నమోదైన ప్రాంతాలు 5 వేలు ఉన్నట్లు భారత ఎన్నికల సంఘం తెలిపిందని, అందులో కామారెడ్డి పట్టణంలోని 214- వడ్డెర కాలనీ, 255- శ్రీరామ్ నగర్ కాలనీలని ఉన్నాయని అన్నారు. ఇందుకు గల కారణాలను విశ్లేషించి ఓటింగ్ పెరుగుదలకు స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వడ్డెర కాలనీ వాసులతో ముచ్చటించాగా స్థానికంగా ఉన్న వారందరు ఓటు వేస్తున్నారని, కిరాయిదారులు, వలసదారుల ఓటింగ్ రోజు రాకపోవడం వల్ల ఓటింగ్ శాతం తగ్గి ఉండవచ్చని అభిప్రాయం పడగా, ఓటరు జాబితాను పరిశీలించి వలస దారులు, అద్దెకు ఉండే కుటుంబాలను సంప్రదించి పోలింగ్ రోజు తప్పక జిల్లా కేంద్రంలో ఉండి ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ప్రాముఖ్యతనుపై అవగాహన కలిగించి నేను ఖచ్చితంగా ఓటేస్తాను అని శపథం తీసుకొని వంద శాతం ఓటు వేసేలా చూడవలసినదిగా బూత్ స్థాయి అధికారులకు సూచించారు. వలస వెళ్లిన వారై ఉంటే అక్కడ ఓటరుగా నమోదు చేసుకొని ఇక్కడ తొలగించుకొనుటకు అవగాహన కలిగించాలన్నారు. వేసవి దృష్ట్యా ఫస్ట్ అవర్‌లోనే అధిక శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. రంగనాధ రావు, స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, బూతు స్థాయి అధికారి సుజాత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్


హాజరైన స్థానికులు

ఫసల్ బీమా కల్పించకుండా
రైతులను నిండా ముంచారు

- బీఆర్ఎస్ పార్టీకి పంటల నష్ట పరిహారంపై మాట్లాడే అర్హత లేదు
- తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

పంటల నష్టం పరిహారంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని, పంటల బీమా పథకాన్ని అమలు చేయకుండా రైతుల ఉసురు పోసుకున్నది ఆ పార్టీనేనని, అలాంటి పార్టీ ఇప్పుడు పంట నష్టపరిహారం గురించి మాట్లాడడం అంతకులే సంతాప సభ పెట్టుకున్నట్లుగా ఉందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పిసిసి ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే గత ప్రభుత్వం నయా పైసా ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. పంట నష్టం ఇప్పియ్యాలని రైతులు హైకోర్టు ఆశ్రయించిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని కేసీఆర్ పాలనలో చోటుచేసుకున్నట్టు తెలిపారు. 7219 కోట్ల విలువైన పంట నష్టం జరిగిందని హైకోర్ట్‌కి చెప్పిన కెసిఆర్ సర్కార్.. దిగిపోయిన నాటికి పైసా ఇవ్వలేదని, కేంద్రం నుంచి వచ్చిన 1500 కోట్ల పంట నష్టాన్ని కూడా పంపిణీ చేయలేదని ఆరోపించారు. దేశంలో పంటల బీమా పథకం అమలుచేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, అకాల వర్షాలు వచ్చినా, వడగండ్లు పడినా, ప్రకృతి విపత్తులు వచ్చి పంటలు నాశనమైనా ఏనాడూ పైసా చెల్లించలేదని తెలిపారు. తొమ్మిదేళ్ల తర్వాత ఒకసారి కేసీఆర్ పంటలు పరిశీలించి నష్టపరిహారం ఇస్తున్నట్లు హడావిడి చేసినా అతి కొద్ది మందికే ఇచ్చారని తెలిపారు.

తాము అధికారం లోకి వచ్చి మూడు నెలలు అవుతుందని, మొదటి సారి నష్టం జరిగినా ముఖ్యమంత్రి సర్వే చేయాలని చెప్పి ఎకరా పంట నష్టానికి రూ.10 వేల పరిహారం ప్రకటించినట్టు తెలిపారు.

ఫసల్ బీమా యోజనలో ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం చేరిందని, వచ్చినా 90 రోజుల్లోనే ఆ పథకంలో చేరుతున్నట్లు ఏంటి వ్యవసాయ సెక్రటరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఒప్పందం చేసుకున్నారని, అది తమ పార్టీ చిత్తశుద్ధి అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మూప్పా గంగారెడ్డి, సిరికొండ గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అల్లూరి మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ శశిందర్‌రెడ్డి, సుంకేట బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతల వేలంలో అప్‌సెట్ ధర రావాల్సిందే

- ధర రాకుంటే మళ్లీ వేలం.. లేకుంటే జీపీ కార్మికులతో సంత నిర్వహిస్తాం : డిఎల్‌పిఓ శ్రీనివాస్


మాట్లాడుతున్న డీఎల్‌పీవో

నవతెలంగాణ-నవీపేట్

సంతల వేలంలో అప్ సెట్ ధర రావాల్సిందేనని నిజామాబాద్ డిఎల్ పి ఓ శ్రీనివాస్ అన్నారు. వేలం పాట మూడుసార్లే నిర్వహించాలనే నిబంధన లేదని, ధర రాకుంటే మళ్లీ వేలం పాట వేయొచ్చని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి ఎంపీడీవో నాగనాథ్‌తో మాట్లాడారు. నవీపేట్ మేకల, వారాంతపు సంతలో అప్‌సెట్ ధర రాకుండా వేలం పాటదారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే వేలం పాడుతున్న వైనంపై నవతెలంగాణలో ప్రచురితమైన వరుస కథనాల నేపథ్యంలో డీఎల్‌పీవో నవీపేట్ రావడం పట్ల ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరు అయినటువంటి సంతల వేలంలో అప్ సెట్ ధర రావాల్సిందేనని అన్నారు. నవీపేట్ మేకల, వారంతపు, సులబ్ కాంప్లెక్స్ ల వేలం పాటలు మూడుసార్లు వాయిదా పడినా విషయమై నవతెలంగాణ ప్రశ్నించగా అప్ సెట్ ధర వచ్చేవరకు వేలంపాట నిర్వహించుకోవచ్చని తెలిపారు. నవీపేట్ సంతల వేలం నివేదిక డిపిఓ, కలెక్టర్ కు పంపామని వారు ఆదేశిస్తే పంచాయతీ ఆదాయం పెరిగేలా రీ వేలంపాట లేదా పంచాయతీ సిబ్బందితో వసూళ్లు చేసుకొని పంచాయతీ ఆదాయాన్ని పెంచుకుంటామని అన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున పంచాయతీలకు కేంద్ర నిధుల విడుదల ఆగిపోయినందున పంచాయతీ కనీస అవసరాలకు కచ్చితంగా మరింత ఆదాయం పెంచుకోవాల్సిందేనని అన్నారు.

వైద్యుని నిర్లక్ష్యంతో బాలుడు మృతి

ప్రయివేటు ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

నవతెలంగాణ-ఆర్మూర్



సకాలంలో వైద్యం అందక బాలుడు మృతిచెందాడు. కాగా వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని కుటుంబీకులు పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహా ఆనంద్ పిల్లల ఆస్పత్రి ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. అంకాపూర్ గ్రామానికి చెందిన నీలం మహేందర్, గంగా దంపతులకు ఏడాది వయస్సుగల కుమారుడు నీలం వికాస్‌కు ఫీట్స్ రావడంతో పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఆనంద్ పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు.. మొదట పరిస్థితి విషమంగా ఉందని ,జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సలహా ఇచ్చాడు. దీంతో బాలుడిని జిల్లా కేంద్రానికి తరలించడానికి అంబులెన్స్ ను సిద్ధం చేసుకున్న తల్లిదండ్రులకు, తానే చికిత్సలు చేస్తానని వైద్యుడు ఆనంద్ చెప్పడంతో అడ్మిట్ అయినారు. మధ్యాహ్నం సమయంలో బాలుడికి మరోసారి ఫిట్స్ రాగా ఆ సమయంలో వైద్యుడు ఆనంద్ అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది తమకు తెలిసీతెలియని చికిత్సలు చేసి వైద్యునికి సమాచారం ఇచ్చినారు. హుటాహుటిన ఆసుపత్రికి వచ్చిన వైద్యుడు బాలుని పరీక్షించి మృతి చెందాడని చేతులెత్తేశాడని తల్లిదండ్రులు బోరున విలపిస్తూ తెలిపారు. జిల్లా కేంద్రానికి తీసుకెళ్తే బతికేవాడని, వైద్యుడి నిర్లక్ష్యంతో బాబు మృతిచెందాడని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని బాధితులకు న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

సీమంతాలు, అన్నప్రాసన


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్
ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషణ పక్షంలో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, ఏడు నెలల పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బీ హాజరయ్యారు. కార్యక్రమంలో సిడిపిఓ భార్గవి, అడిషనల్ సీడీపీ ఓ జ్యోతీ, మునిసిపల్ కమిషనర్ రాజా, ఐసీడీఎస్ సూపర్వైజర్స్ హెల్త్ సూపర్వైజర్, పీ ఈ టీ సుజాత, ఐసీడీఎస్ ఆఫీస్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

దీప్‌దాస్ మున్షి, సీఎంను కలిసిన మోహన్ రెడ్డి


సీఎంకు బొకేను అందజేస్తున్న మనాల

నవతెలంగాణ-కంఠేశ్వర్
జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డిని రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించినందుకు శుక్రవారం ఆయన ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రాష్ట్ర ఇంఛార్జి దీప్‌దాస్ మున్షి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఇంఛార్జి, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్ పల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

నవతెలంగాణ-సిరికొండ
చీమన్‌పల్లి జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన మాలవత్ నితిన్ ఈనెల 10న సోషల్ వెల్ఫేర్ బాయ్స్ స్కూల్ ఆర్మూర్ లో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పిఈటి నవీన్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అలైర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీలలో జరిగే ఎనిమిదవ రాష్ట్రస్థాయి అండర్ 14 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎం.నితిన్ ఎంపికైనందున పాఠశాల బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనపురం దేవేందర్‌కు సన్మానం


ఘనపురం దేవేందర్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్
ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా మార్చి 21 గురువారం రాత్రి హైదరాబాద్ కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్లో భారత సాహిత్య అనువాద పరిషత్, విమల సాహిత్య సమితి సంయుక్త నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనం హృద్యంగా సాగింది. నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ ఈ కవి సమ్మేళనంలో "అస్తిత్వం" అనే కవితను చదివి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనపురం దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు. డాక్టర్ టీకే కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, డాక్టర్ జల్ది విద్యాధరరావు, డాక్టర్ విడి రాజగోపాల్, డాక్టర్ దామోదరాచారి, పద్మ, రమాదేవి కులకర్ణి, సుతారపు వెంకట్ నారాయణ, నివాస్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లొద్దు

- ఎస్ఐ భాస్కరా చారి



నవతెలంగాణ-ముప్కాల్
హెూలీ పండుగ సందర్భంగా యువకులు, పిల్లలు సమన్వయం పాటించాలని ముప్కాల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ భాస్కరా చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెూలీ పండుగ వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లలు గ్రామ చెరువుల వద్దకు, యువకులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. యువత మద్యం మత్తులో నీటి ప్రవాహ ప్రాంతాల్లోకి వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని యువకులు గ్రహించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పిఆర్‌టీయు నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్
మండల పిఆర్‌టియు తరపున బాధిత కుటుంబానికి చేస్తున్న వితరణ అభినందనీయమని జిల్లా పిఆర్టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి, వెంకటేశ్వర గౌడ్ అన్నారు .ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రాథమిక పాఠశాల జాన్కంపేట్ పిటి ఎఫ్ బాలయ్య కుటుంబానికి రూ. 47,100 వేల్పూర్ మండల పిఆర్‌టియు శాఖ ఆధ్వర్యంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంకం నరేష్, బోడ దేవానందం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల చేతుల మీదుగా శుక్రవారం బాధిత కుటుంబానికి అందించారు. అనంతరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఆర్థిక సాయం అందించిన పిఆర్టియు సంఘం ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియు ఆర్మూర్ డివిజన్ ఇంచార్జ్ తుమ్మల లక్ష్మణ్ నిజామాబాద్ డివిజన్ ఇంచార్జ్ ప్రవీణ్ రెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హరిచరణ్ ఉపాధ్యక్షులు వినయ్ కుమార్ రవీందర్ గౌడ్ ప్రశాంత్ రెడ్డి మండల అసోసియేట్ అధ్యక్షుడు సుధీర్ కుమార్ మండల మహిళా ఉపాధ్యక్షురాలు శైలజ, పచ్చల నడుకుడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్
44 నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చనిపోయినట్టు ఎస్సై గంగాధర్ తెలిపారు. బైకుపై వస్తున్న వ్యక్తి కారును వెనుక నుండి ఢీకొన్నాడు. ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న షేక్ కరీం (58) మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని, శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

షార్ట్‌ఫిలీంలతో చట్టాలపై మరింత అవగాహన

- జిల్లా జడ్జి కుంచాల సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- థియేటర్‌లో షార్ట్‌ఫిలీం ప్రదర్శన.. హాజరైన పలువురు



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్
న్యాయ సేవాధికార సంస్థ పనితీరును వివరిస్తూ, చట్టాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు, అన్యాయాలు, మోసాలకు గురైన సందర్భాల్లో న్యాయ సహాయం ఎలా పొందాలనే అంశాలను వివరిస్తూ రూపొందించిన షార్ట్ ఫిలింలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉషాప్రసాద్ మల్టిప్లెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. జిల్లా జడ్జి సునీత కుంచాల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేయగా, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఇతర అధికారులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని షార్ట్ ఫిలింలను తిలకించారు. చిన్నారులపట్ల లైంగిక నేరాలకు పాల్పడితే ఫోక్సో చట్టం కింద అమలయ్యే కఠిన శిక్షలు, బాధితులు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఏ విధంగా సహాయం పొందవచ్చు అనే అంశాలతో కూడిన షార్ట్ ఫిలిం అందరినీ ఆలోచింపజేసింది. అదేవిధంగా సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానసిక రుగ్మతలకు సరైన చికిత్స చేయించకుండా మూఢ నమ్మకాలతో ముడిపెట్టడం, బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత తదితర అంశాలను ఎంతో అర్థవంతంగా స్పృశిస్తూ సీత కథ, వల, ముందడుగు, గెలుపు, మలుపు, మనోవ్యాధి, జోజో పాపాయి శీర్షికలతో రూపొందించిన తక్కువ నిడివి కలిగిన ఫిలింలు అయినప్పటికీ ఆలోచింపజేశాయి. ముఖ్యంగా పై సందర్భాల్లో అన్యాయాలు, మోసాలకు గురయ్యే వారికి లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందిస్తున్న సేవల గురించి అర్థమయ్యే రీతిలో షార్ట్ ఫిలింల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. సామాజిక స్పృహతో వివిధ వర్గాల వారిని చైతన్యపరిచేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ క్రియాశీల కంగా వ్యవహరిస్తూ అనేక కార్యక్రమా లను నిర్వహిస్తోందని అభినందించారు. ఇదే కోవలో ఆయా చట్టాల పట్ల, నేటి సమాజంలో పెచ్చు మీరిన సైబర్ నేరాలు, చిన్నారులపై లైంగిక దాడులు వంటి వాటి గురించి ప్రజలను జాగృతపర్చేం దుకు, సహాయం పొందే మార్గాల గురించి షార్ట్ ఫిలింల ద్వారా వివరించే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు.

జిల్లా జడ్జి సునీతా కుంచాల మాట్లాడుతూ.. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన షార్ట్ ఫిలిం ప్రదర్శనను రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లాంఛనంగా ప్రారంభించగా, ప్రాంతీయ స్థాయిలో మొట్టమొదటగా నిజామాబాద్ జిల్లాలోనే వీటిని విడుదల చేయడం జరుగుతోందన్నారు. నేర రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా, చట్టాల పట్ల ప్రజల్లో అవగా హన పెంపొందిస్తూ, అన్యాయాలకు గురైన సందర్భాల్లో బాధితులు మనోధైర్యం కోల్పోకుండా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఏమేరకు సహాయం పొందవచ్చు అనే అంశాలను తెలియజేస్తూ రూపొందించిన షార్ట్ ఫిలింలు అవగాహన పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడ తాయని అన్నారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేటి సమాజంలో డిజిటల్ నేరాలు పెరిగిపోయాయని, వాటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా షార్ట్ ఫిలిం రూపొందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో జడ్జి పద్మావతి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, షార్ట్ ఫిలింలకు దర్శకత్వం వహించిన సాయిప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



ఉషాప్రసాద్‌లో షార్ట్ ఫిలీంను వీక్షిస్తున్న అధికారులు, పోలీసులు, జడ్జిలు, పలువురు

క్యాన్సర్ వ్యాధిని తరిమికొడదాం

- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్
క్యాన్సర్ వ్యాధిని తరిమికొడదామని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి అన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మచ్చర్ల గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా పిఓడబ్ల్యు, పివైఎల్, ఏఐపికేఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... క్యాన్సర్‌పై ఉన్న అపోహలను ప్రజలు నమ్మవద్దని, క్యాన్సర్ భూతాన్ని తరిమికొట్టాలని తెలిపారు. మనం తీసుకుంటున్న ఆహారం స్వచ్ఛమైనదిగా తీసుకోవాలని, క్యాన్సర్ అంటే ఒక తేలికపాటి వ్యాధిగానే అనుకోవాలని అన్నారు. క్యాన్సర్ పరీక్ష, రొమ్ము క్యాన్సర్ గాని ఫిజికల్ ఎగ్జామినేషన్ తదితర టెస్టులను ఉచితంగా చేయడం అంటే పేద ప్రజలకు చాలా ఆర్థిక భాగం తగ్గుతుందని అన్నారు.. అఖిలభారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి, ప్రభాకర్ మాట్లాడుతూ.. క్యాన్సర్ పై ప్రభుత్వం అవగాహన కల్పించాలని, క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని ప్రజలు వదిలేయాలని తెలిపారు. క్యాన్సర్ మరణాల్లో భారతదేశం ప్రథమ స్థానంలో ఉందని, ఈ ప్రపంచంలో ఉన్న క్యాన్సర్ బాధితులు ఈ దేశంలో 66శాతం ఉన్నారని, గతంలో అమెరికాలో లక్షలాదిమంది క్యాన్సర్ బారిన పడితే అక్కడ ప్రభుత్వం చర్యలు తీసుకొని వారికి వైద్యాన్ని అందుబాటులో తెచ్చి సంఖ్య క్రమంగా తగ్గిందన్నారు. క్యాన్సర్ బాధితులనున క్యాన్సర్ ఇన్సూరెన్స్ లో చేర్చి ఆదుకోవడం జరిగిందన్నారు. కావున అదే పద్ధతిని భారత దేశంలో ప్రభుత్వాలు కూడా తీసుకురావాలని, క్యాన్సర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి క్యాన్సర్ రోగాన్ని తరిమికొట్టాలని, ప్రతి ఒక్కరికి క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయాలని, ప్రభుత్వం క్యాన్సర్‌ను ఇన్సూరెన్స్ లో చేర్చాలని తెలిపారు. క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తున్న గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పస్కా నరసయ్య, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి, దేవారం, మచ్చర్ల గ్రామ విడిసి చైర్మన్ రాజ్ కుమార్, కోశాధికారి అమృత్, మాజీ సర్పంచ్ జీ.నర్సయ్య, డాక్టర్లు అశోక్ ఎండి, డాక్టర్ రమేష్, ప్రజాసంఘాల నాయకులు బి.కిషన్, ఆకుల గంగన్న, మచ్చర్ల రాజన్న, నరేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ మృతి విప్లవ కార్మికోద్యమానికి తీరని లోటు

- బలమైన విప్లవకార్మికోద్యమ నిర్మాణమే ఆయనకు నివాళి


నిజామాబాద్‌సిటీ :నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు, ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వడ్లకొండ కిరణ్ చిత్రపటానికి భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్. ఆర్ భవన్, కోటగల్లీలో పూల మాలలతో విప్లవ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న ఎం.సుధాకర్ మాట్లాడుతూ... కామ్రేడ్ వి.కిరణ్ క్యాన్సర్ వ్యాధితో గురువారం అమరులయ్యాడన్నారు. కామ్రేడ్ కిరణ్ మరణం కార్మిక వర్గానికి, ముఖ్యంగా ఆటో కార్మిక వర్గానికి తీరని లోటని అన్నారు. కామ్రేడ్ కిరణ్ అనేక కార్మిక ఉద్యమాలలో, ప్రజా ఉద్యమాలలో, తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడన్నారు. ఆటోరంగ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ అండగా నిలిచాడన్నారు. కిరణ్ క్యాన్సర్ వ్యాధితో అర్ధాంతరంగా మృతి చెందటం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆశయ సాధన కోసం పోరాడడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, పి.సాయ రెడ్డి, టి.విటల్, చరణ్, పీవైఎల్ నాయకులు మోహన్ పిఓడబ్ల్యు నాయకులు లలిత, అమూల్య పాల్గొన్నారు.

సిరికొండ: భారతకార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు, తెలంగాణ ప్రగతిశీల ఆటోవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, మాస్ లైన్ (ప్రజాపంథా) హైదరాబాద్ సిటీ నాయకులు కామ్రేడ్ వి .కిరణ్ మృతి విప్లవ కార్మికోద్యమానికి తీరని లోటుఅని బలమైన విప్లవకార్మికోద్యమ నిర్మాణమే నిజమైన నివాళి అని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వి. కిరణ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మాస్ లైన్ (ప్రజాపంథా)పార్టీ, ఐఎఫ్‌టీయూ, ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్ పల్లి: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కిరణ్ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్ టియు)జిల్లా సహాయకార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షురాలు వి. సత్తెమ్మ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)పార్టీ, ఐఎఫ్ టియు, ఏఐపీకేఎస్ డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ పిలిచి టికెట్ ఇస్తామన్నా ఎవరు రావట్లే

- సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
గతంలో ఎవరికి అపాయింట్మెంట్ (టైం) ఇవ్వని కేసీఆర్, ఇప్పుడు ఫోన్ చేసి పిలుచుకొని మాట్లాడుతున్నా ఎంపీ గా పోటీ చేయడానికి ఎవరు సిద్ధంగా లేరని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20, 21 న సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరిగాయని, ఈ సమావేశాలలో దేశంలో ఉన్న బిజెపి 10 సంవత్సరాల కాలంలో అనుసరించిన ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించారని అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజలు తెలంగాణ వాదం గెలిపించడం కోసం మొదటిసారి టిఆర్ఎస్‌ను గెలిపించారని, ఇచ్చిన హామీలు అమలు చేస్తాడన్న నమ్మకంతో రెండవ సారి గెలిపించారని తెలిపారు. అయినా ఇచ్చిన హామీలను రెండోవ సారి అమలు చేయకపోగా... ప్రజలకు, కార్మిక నాయకులకు, టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అపాయింట్మెంట్ ఇవ్వకుండా..., ఫామ్ హౌస్ కే పరిమితమై పాలన చేసిన కెసిఆర్‌కు ప్రజలు ఓడించారని అన్నారు. ప్రస్తుతం స్వయంగా కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ ముఖ్యమైన నాయకులకు ఫోన్ చేసి పిలుచుకొని మాట్లాడిన ఎంపీగా పోటీ చేయడానికి ఎవరు సిద్ధపడటం లేదని అన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడంతో కేసీఆర్‌కు తెలంగాణలో రుణం తీరిపోయిందని స్పష్టం చేశారని తెలిపారు. ఇన్ని రోజులు లోపాయి కారిగా పొత్తు పెట్టుకున్న బిజెపిని సహితం పట్టించుకోవడంలేదని, రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయడంలో బిజెపి విఫలమైందని, దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పనంగా, అప్పచెప్పిన బిజెపికి, 'తెలంగాణలో బీఆర్ఎస్ కు పట్టిన గతే దేశంలో బిజెపికి పడుతుందని' అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.రఘురాం, పి.నర్సింగరావు, ఆనంద్, ప్రకాష్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

- ఏడుగురికి జరిమానా, కౌన్సిలింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
మద్యం తాగి వాహనం నడిపిన పదిమందికి కౌన్సెలింగ్ నిర్వహించి ముగ్గురికి జైలుశిక్ష, ఏడుగురికి జరిమానా విధించినట్లు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపి నారాయణ, ట్రాఫిక్ సిఐ వెంకటరమణ తెలిపారు. తాగి వాహనం నడిపిన 10 మందికి ట్రాఫిక్ సిఐ వెంకట నారాయణ సమక్షంలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. తదనంతరం కోర్టులో మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ముందర హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఏడుగురికి 7300 రూపాయల జరిమానా విధించగా మరో, ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష విధించారు.

భగత్ సింగ్ వర్ధంతి వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణ కేంద్రంలోని మామిడిపల్లిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్, పివైఎల్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించి అమరులయ్యారు. వారి స్ఫూర్తితో యువత పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా, రష్యా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. దేశంలో మతోన్మాదం, ఫాసిజం పెరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం అయ్యాయన్నారు. ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక యువత పెడదారి పడుతున్నారన్నారు. సమానత్వం, సమ సమాజ కోసం జరుగుతున్న పోరాటంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం దోపిడీ, పీడన లేని నూతన వ్యవస్థ కోసం యువతీ యువకులు తిరుగుబాటుకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30 వరకు భగత్ సింగ్,రాజు గురు సుఖదేవ్ వర్ధంతులను గ్రామగ్రామాన, వాడవాడలో జరపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, పవన్, ప్రవీణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

25, 26న మార్కెట్ యార్డ్‌కు సెలవులు

27, 28న తెరిచి ఉంటుంది : మార్కెట్ కమిటీ కార్యదర్శి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
25, 26వ తేదీల్లో మార్కెట్ యార్డ్‌కు సెలవులు ఉన్నందున రైతు సోదరులు సహకరించాలని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ది నిజామాబాద్ మర్చంట్స్ అసోసియేషన్ వారు ఈనెల 25, 26 న హెూలీ పండుగకు సెలవులు, అదేవిధంగా ఆర్థిక సంవత్సరం 2023-24 ముగింపు లెక్కలు ఉన్నందువల్ల ఈనెల 29 నుండి 31 వరకు శ్రద్ధానంద్ గంజ్ మార్కెట్ యార్డులో వ్యాపారకార్యకలాపాలు బందు ఉంచాలని ది నిజామాబాద్ మర్చంట్స్ అసోసియేషన్ వారు కోరారని పేర్కొన్నారు. ఈనెల 27, 28న మాత్రమే యార్డునందు పసుపు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 28 న మిగులిన కాంటాలను 29న చేస్తారని పేర్కొన్నారు. అని ఈ విషయాన్ని రైతుసోదరులు గమనించి యార్డుకు సరుకులు తీసుకరాద్దని కోరారు. తిరిగి వచ్చె నెల (ఏప్రిల్ 01న) మార్కెట్ కమిటీ లోని మార్కెట్ యార్డ్ లో వ్యాపార కార్యకలాపాలు యదావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- సూపర్ స్పెషలిటీ కంటి హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని పెద్దలు అన్నారని, అందుకే కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఖలీల్ వాడి ప్రాంతం లో 'ఐ సూపర్ స్పెషాలిటీ' ఆసుపత్రి ప్రారంభానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ కంటికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న హైదరాబాద్ నగరానికి వెళ్లాల్సిన పని లేదని తెలిపారు. అనుభవం ఉన్న కంటి వైద్య నిపుణులు డాక్టర్ టి. శ్రీనివాస్ అని, కంటి వైద్యంలో స్పెషల్ సర్జన్ ఇప్పుడు మన నిజామాబాద్‌లోనే అందుబాటులో ఉన్నారన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి యజమాని కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెటీన ఆపరేషన్, కుట్లు లేకుండా శుక్లాల ఆపరేషన్, కాంటాక్ట్ లెన్స్ సౌకర్యం, మోతి బిందు తీసి కంటిలో అద్దం అమర్చుట, కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు చేయడం వంటివి ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ల లక్ష్మి నారాయణ, కార్పొరేటర్, ఇల్లేందుల మమతా ప్రభాకర్, భాస్కర్, మఠం పవన్, ఆనంద్, హరీష్ రెడ్డి, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని శుక్రవారం తహసీల్దార్ లక్ష్మణ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. గురువారం రాత్రి పర్మల్ల గ్రామం నుంచి నాగిరెడ్డి పేట్ మండల కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలించిన ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజు పేర్కొన్నారు.



పట్టుకున్న ట్రాక్టర్ నుంచి ఇసుక అన్‌లోడింగ్

ఇంటి పన్ను చెల్లించండి.. అభివృద్ధికి ఆసరా కండి

నవతెలంగాణ-వర్ని

గ్రామస్తులు ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి ఆసరా కావాలని అధికారులు కోరుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని ఎస్ఎన్‌పురం గ్రామంలో ఇంటి పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని జిల్లా అభివృద్ధి అధికారి పారంభించారు. ప్రతి ఇంటి యజమాని ఇంటి పన్ను చెల్లించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఇప్పటి వరకు 90శాతం ఇంటి పన్నులు వసూలు అయినట్లు పంచాయతీ సెక్రటరీ సాయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చందర్ తదితరులున్నారు.



పన్ను వసూలు చేస్తున్న అధికారులు


ప్రజల కోసం కాంగ్రెస్

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు
- బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/మద్నూర్

ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు అన్నారు. శుక్రవారం మండలంలోని విట్టల్‌వాడి, విట్టల్‌వాడి తాండ, పోచారం తాండ, శివపూర్, బూరుగుపల్లి గ్రామాలలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మి కాంత్‌రావు సమక్షంలో సుమారు 217మంది చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామ ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తాను జుక్కల్ ప్రజల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల కోసం అభివృద్ధి పనులు చేసి పెద్దకొడపగల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా గత బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు ఎక్కడ కూడా లేదని ఆయన ఎద్దేవా చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం184 గ్రామాలు ఉండగా అందులో 167 గ్రామాలకు తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. దీంతో వెంటనే ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్యను దూరం చెయ్యాలనే ఉద్దేశ్యంతో బోరు మోటార్లు వేయించినట్టు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, చిప్ప మోహన్, కల్లూరి పండరీ, జగిర్‌నాయక్, కానా నాయక్, మష్టాపాటిల్, రామారావు, పాటిల్, శ్రీహరి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : ప్రతి బీద వాడిని కలిసి వారి అవసరాలు ఏమిటో తెలుసుకోవాలని.. అభివద్ధి పనులు తాను చేపడతానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అన్నారు. మద్నూర్ మండలంలోని గోజేగావ్ గ్రామ సర్పంచ్ అనిత ఇరవంత్ దేశ్ముఖ్, మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివాజీ రాథోడ్ వారితోపాటు గ్రామంలోని వందల సంఖ్యలో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండలానికి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, ఆత్మ కమిటీ చైర్మన్ కొండగంగాధర్, సీనియర్ నాయకులు హనుమాన్ స్వామి, వట్నాల రమేష్, జావిద్ పటేల్, సాయి పటేల్, హనుమంతరావు దేశాయ్, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



పెద్దకొడప్‌గల్ : కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు

దళారులను ఆశ్రయించొద్దు

- జిల్లా సహకార అధికారి రవీందర్
- సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో

నవతెలంగాణ-బోధన్

రైతులు దళారులను ఆశ్రయించకుండా.. నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని జిల్లా సహకార అధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం బోధన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని మావందిఖుర్దు గ్రామంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. నాణ్యమైన సన్ ఫ్లవర్ పంటను తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఉమాకాంత్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ మండలాధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. నియోజకవర్గంలో మొత్తం ఎనిమిది మండలాలున్నాయి. మద్నూర్ మండల అధ్యక్షులుగా ధరాస్ సాయిలు, డోంగ్లి మండల అధ్యక్షునిగా బసవరాజ్ పటేల్, బిచ్కుంద మండల అధ్యక్షునిగా దర్పల్ గంగాధర్, జుక్కల్ మండల అధ్యక్షునిగా మలిపతి సంజయ్ కుమార్, పెద్దకొడప్‌గల్ మండల అధ్యక్షునిగా మహేందర్‌రెడ్డి, మహమ్మద్‌నగర్ మండల అధ్యక్షునిగా రవీందర్‌రెడ్డి, పిట్లం మండల అధ్యక్షునిగా సిహెచ్ హనుమాన్లును నియమించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ ఎమ్మెల్సీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

హెూమ్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

హెూమ్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జుక్కల్ నియోజకవర్గం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి శ్రీనివాస్‌రెడ్డి మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి బూత్‌లెవెల్ బిఎల్ఓలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మ్-12డి ద్వారా పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులు, వయోవృద్ధులు 85 సంవత్సరాలు పైబడిన వారు తమ ఓటు హక్కును ఇంటి దగ్గరే వినియోగించుకునే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని అన్నారు. బిఎల్ఓలు ప్రతి గ్రామంలో వికలాంగులు, వయోవృద్ధులకు, 85 సంవత్సరాలు పైబడిన వారు ఓటు హక్కును ఇంటి దగ్గరే వినియోగించుకునే విధంగా వారిని జాగ్రత్తగా గుర్తించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ హెూం ఓటింగ్ షెడ్యూల్ ప్రకటించిన వెంటనే దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించే కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో మద్నూర్ మండల తహసీల్దార్ ఎం.డీ ముజీబ్, డి.టి భరత్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావార్ శంకర్ బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్‌రెడ్డి

ఓటు వజ్రాయుధం

- ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి
- మద్నూర్ తహసీల్దార్ ఎం.డీ ముజీబ్



ఓటు చైతన్య యాత్రలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మద్నూర్ తహసీల్దార్ ఎం.డీ ముజీబ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రం వరకు ఓటరు చైతన్య పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వరకు వచ్చిన ఓటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది ఓటు వేసే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. ఒక్క ఓటుకు ఉన్న శక్తిని హక్కుగా ప్రజలు వినియోగం చేసుకోవాలని అన్నారు. వజ్రాయుధం లాంటి ఓటు హక్కును యువతీ యువకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.టి భరత్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావార్ శంకర్, కార్యాలయ సిబ్బంది ఓటర్లు పాల్గొన్నారు.

వైభవంగా కాళికా దేవి ఆలయ ప్రారంభోత్సవం



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న పండితులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని పాత గడి ముందర కాళికాదేవి ఆలయాన్ని హంపీ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి చేతుల మీదుగా శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం కాళికాదేవి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు మూడు రోజులపాటు యజ్ఞయాగాదులతో, వేద పండితుల మధ్య పూజలు చేపట్టి.. వేడుకలు నిర్వహించగా శుక్రవారం ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించారు. కాగా మహిళలు ఉపవాస దీక్షతో పెద్ద ఎత్తున పాల్గొని పూలు, కుంకుమార్చనతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వేద పండితులు శేఖర్ పంతులు, విశ్వబ్రాహ్మణులు వడ్ల దత్తు, వడ్ల రామకృష్ణ, వడ్ల రమేష్, వడ్డదత్తు, వడ్ల సత్యం, వడ్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు

- కిరణ్ చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-బోధన్

ఆటో మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు, ప్రగతిశీల ఆటోవర్కర్స్ యూనియన్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కు ఐ.ఎఫ్.టీ.యు ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి శుక్రవారం పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ.. కామ్రేడ్ వి.కిరణ్ నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ గ్రామవాసి అని, ఆయన హైదరాబాద్ నగరంలో ఆటో కార్మికుడిగా జీవనం కొనసాగిస్తూ ఆటో కార్మికులందర్నీ ఐఎఫ్‌టీయూ జెండా కింద ఐక్యం చేసి ప్రగతిశీల ఆటో వర్కర్స్ యూనియన్ స్థాపించారని అన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలను చేశారని, తెలం గాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీల పాత్రను పోషించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే, తర్వాత ఆటో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలపైన ఉద్యమాన్ని నిర్మించిన దానిలో క్రియాశీల పాత్ర పోషించారని తెలిపారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, పిఓడబ్ల్యు పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, యం.శాంతాబాయి, ఐఎఫ్‌టియు నాయకులు అర్షద్ పాషా, ఖాజా, సబ్బార్, నవీన్, శ్రీను, రాము, గంగాధర్, నజీర్, సాజిద్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉపాధిహామీ కూలీలందరికీ పనులు కల్పించాలి

- జుక్కల్ ఎంపిడివో శ్రీనివాస్



ఎంపిడివోను సన్మానిస్తున్న ఉపాధి కూలీలు

నవతెలంగాణ-జుక్కల్

జాతీయ ఉపాధిహామీలో భాగంగా గ్రామాలలో అర్హులైన కూలీలందరికి పనులను కల్పించాలని జుక్కల్ ఎంపిడివో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మైబాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఉపాధిహామీ పనులు చేస్తున్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కూలీ అందుతుందని సూచించారు. ఎండలు పెరుగుతుండటంతో వీలైనంత వరకు ఉదయం ఆరు గంటల లోపు పని ప్రదేశంలో ఉండాలని, ఎండ ఉన్నప్పుడు పనులను నిలిపివేసి సేదతీరాలని కూలీలకు తెలిపారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి విజయ్, ఎఫ్‌ఎ, టీఏ, కూలీలు తదితరులు పాల్గొన్నారు

హంగర్గ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని హంగర్గఫారంలోని కాంగ్రెస్ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా షేక్ సజ్జత్, ఉప అధ్యక్షులుగా రాంప్రసాద్‌రెడ్డి, చందర్‌నాయక్, నాగనాథ్, జనరల్ సెక్రెటరీ షేక్ చాంద్‌పాషా, జాయింట్ సెక్రెటరీగా మొహమ్మద్ సలీం, షేక్ హైమద్, క్యాషియర్ షేక్ మౌలానా, సత్యనారాయణరెడ్డి, మీడియా కన్వీనర్‌గా షేక్ ఆసిఫ్, బూత్ కన్వీనర్‌గా అమీర్‌ఖాన్, సలహాదారులుగా కృష్ణమూర్తి, షేక్ రసూల్, సత్తార్ సేట్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పుప్పాల శంకర్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మన్సూర్, వాజిద్, హనుమంతు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన జయంతి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో తెలంగాణ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శాలివాహన జయంతి ఉత్సవాన్ని జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ.. తాము రాజకీయంగా ఎదిగేందుకు అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు తమ కుమ్మర కులానికి సహకరించాలన్నారు. తాము ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నందున తమను ఏ పార్టీలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాలో వివిధ మండలాల్లో మూడు ఎంపీటీసీలు తమ కుమ్మరులు ఉన్నా.. వారికి ఏ రాజకీయ పార్టీ సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ కులాన్ని గుర్తించి తమ కులానికి సంబంధించిన వారికి ఎంపీపీ, జడ్పిటిసి పదవులను ఇచ్చేలా చూడాలన్నారు. 16 కులాలకు బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కుమ్మరి కులాన్ని మాత్రం విస్మరించారని తాము రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల వరకు జనాభా ఉంటుందన్నారు. రాష్ట్రంలో తమ కుమ్మర కులస్తులకు నామినేటెడ్ పదవి ఇచ్చి ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్షపాతం లేకుండా ప్రతి ఒక్కరికి సమన్యాయం చేస్తున్నారని, అందులో భాగంగా తమ కులానికి కూడా సమన్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డాకురి, కార్యవర్గ సభ్యులు విట్టల్, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కిసాన్ మోర్చా మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో కిసాన్ మోర్చా మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొప్పాజివాడి ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులుగా రాంశెట్టి భాస్కర్, వంగిటి రాజు, ముడుపు పెద్ద బైరవరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సామల సంజీవరెడ్డి, కార్యదర్శులుగా బాణావత్ రాజు, సాకలి శంకర్, చిన్న బీర రాజు, జూకంటి కమలాకర్‌రెడ్డి, సభ్యులుగా తిపిరి పెట్టి బాల్ చంద్రం, లొంక గోపాల్‌రెడ్డి, ప్యారం స్వామి, కుంట రాజులు, ఏనుగు మల్లారెడ్డిని ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో మాందపూర్ మాజీ సర్పంచ్ చేరిక

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట మండలంలోని మందపూర్ మాజీ సర్పంచ్ అల్వాల్ రేవతి శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, భూమా గౌడ్, మధు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు

- చిరుధాన్యంపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని కారేగాం తండాలో పోషన్ పక్వాడాలో భాగంగా బోధన్ సిడిపిఓ జానకి ఆధ్వర్యంలో తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలపై, ఆకు కూరలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భవతులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. సీమంతాలు, అన్నప్రాసన, వెల్ బేబీ షో కార్యక్రమాలు నిర్వహించారు. వెల్ బేబీ షో పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, అంగన్వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

డిసిసిబి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సొసైటీ చైర్మన్లు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కుంట రమేష్‌ను సాలూర మండలానికి చెందిన సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, హున్స సొసైటీ చైర్మన్ మందన్న రవి ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాశంకర్, గణపతిరెడ్డి, నాగేశ్వరరావు తదితరులున్నారు.

భీంగల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- దళిత ఐక్య సంఘం డిమాండ్



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

నవతెలంగాణ-భీంగల్

మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ పర్సన్ నవీన్‌పై చేయి చేసుకున్న భీంగల్ ఎస్సై హరిబాబుపై చర్యలు తీసుకోవాలని భీంగల్ దళిత ఐక్య సంఘటన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన బంధువుల కేసు విషయమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన పర్సన్ నవీన్‌పై చేయి చేసుకోవడంతో పాటు నాన మాటలతో దుర్భసలాడిన ఎస్సై హరిబాబుపై అట్రాసిటీ కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని సందర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత ఐక్య సంఘటన నాయకులు కాంతయ్య, ప్రసాద్, పర్స నవీన్, గంగారాం, రమేష్, రాజేందర్ మరి సంఘం సభ్యులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

4

నిజామాబాద్

శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

పరీక్షల ఫీజు అపరాధ రుసుముతో గడువు పొడగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాల పరిధిలోని ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ, 10వ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్ లాక్ కోర్సు పరీక్షలకు ఫీజు తేదీ అపరాధ రుసుంతో పొడిగించినట్లు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించుటకు చివరి తేదీ 01-04 వరకు ఉండగా 100 రూపాయల అపరాధ రుసుంతో 04-04 వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక్క సబ్జెక్టుకు 250, రెండు సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉంటే 800రూపాయల ఫీజు ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ లను సంప్రదించాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు

అంగన్‌వాడీలు.. విద్యనేర్పే కేంద్రాలు

- సీడీపీవో స్వర్ణలత



మాట్లాడుతున్న సీడీపవో స్వర్ణలత

నవతెలంగాణ-నవీపేట్/ఏర్గట్ల

అంగన్వాడీలు అంటే కేవలం పిల్లలకు అన్నం పెట్టే కేంద్రాలు కావని విద్యను సైతం నేర్పించే కేంద్రాలను ఇన్‌చార్జి సిడిపిఓ స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శిశువు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సిడిపిఓ స్వర్ణలత మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు కేవలం అన్నం పెట్టే కేంద్రాలు కావని చిన్న పిల్లలకు వెయ్యి రోజుల పాటు ఆటపాటలతో విద్య నేర్పే కేంద్రాలని అన్నారు. అంతే కాకుండా మంచి పౌష్టికాహారం అందించి భవిష్యత్తుకు పునాదులు వేసే కేంద్రాలని అన్నారు. చిన్నపిల్లలకు పౌష్టికాహార లోపాలు లేకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులతో పాటు అంగన్వాడీలకు ఉందని అటువంటి అవగాహనను అంగన్వాడీలు కల్పించాలని డాక్టర్ అరవింద్ అన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఏపీఎం భూమేశ్వర్ గౌడ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రదాలక్ష్మి, భాగ్యలక్ష్మి, శోభా, సరిత, వరలక్ష్మి, శ్రీ ప్రియ పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలోని రైతువేదికలో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి అవగాహన కల్పించి, పలు సలహాలు, సూచనలు అందజేశారు. గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ముర్రుపాలు, అనుబంధ పోషకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకే సొసైటీలు

- సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ నర్సయ్య

నవతెలంగాణ-భీంగల్

రైతులను ఆదుకునేందుకే సొసైటీలు పనిచేస్తున్నాయని భీమ్గల్ సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య అన్నారు. పట్టణ కేంద్రంలోని సొసైటీ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ అధ్యక్షతన 60వ మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన ఆరు మాసాల ఆదాయ, వ్యయ వివరాలను సీఈఓ అశోక్‌గౌడ్ చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సొసైటీల ద్వారా సబ్సిడీ రుణాలను అందజేస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీ కానీ రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గత ఆరు మాసాల్లో మృతిచెందిన సంఘ సభ్యులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు ఈ సభలో ఉపాధ్యక్షులు జిన్న శోభన్, డైరెక్టర్లు బాల గంగు, గంగ స్వామి, గంగం అశోక్, సాయిబాబా, నూకల లింబాద్రి, సూల్ల గంగాధర్, నాగుల భూమన్న, గుగులోత్ సర్దార్, బెజ్జోర ప్రకాష్ పాల్గొన్నారు.

జీవాలకు గాలికుంటు నివారణా టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్/జక్రాన్‌పల్లి

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యులు కిరణ్ దేశ్ పాండే, ఉమమా సహేర్ అధ్వర్యంలో శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 892 పశువులకు టీకాలు వేశమన్నారు. రైతులు తమ పశువులకు తప్పకుండా వ్యాధి నివారణ టీకాలను వేయించాలని తెలిపారు. విఎల్ఓ వినీత, జేవిఓ గంగ జమున, విఏ అహ్మద్ పాషా, గోపాల మిత్ర సుదీర్, జైల్ సింగ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పశువులకు ఎఫ్ఎమ్‌డి వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్టు మండల పశువైద్యాధికారి శిరీష శుక్రవారం తెలిపారు. గ్రామంలోని అన్ని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గ్రామ రైతులు ఉన్నారు.

జల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత



జలసంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

జీవావరణానికి జల ధార ప్రాణధారమని, జల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ నీరు లేనిదే సమస్త జీవకోటికి మనుగడ లేదని ప్రకృతి వనరుల, పర్యావరణం అసమతుల్యతే ప్రస్తుత నీటి ఎద్దడికి ప్రధాన కారణమని తెలిపారు. ప్రకృతిని పరిరక్షించడం, కాలుష్య కారకాలను నిర్మూలించడంలో మానవులు క్రియాశీలక పాత్ర పోషించడం ద్వారానే సమస్త జీవకోటి మనుగడకు దోహదమౌతుందన్నారు. భవిష్యత్ తరాలకు కరువు కాటకాలు లేని సమాజాన్ని నిర్మించడంలో, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరు ముందుండలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మతోన్మాదశక్తులపై సమరశీల పోరాటాలకు యూనివర్సిటీలే కేంద్రం కావాలి

- పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్
- విద్యా వ్యతిరేక సంస్కరణలను వ్యతిరేకించాలని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మతోన్మాదశక్తులపై సమరశీల పోరాటాలకు యూనివర్సిటీలే కేంద్రం కావాలని పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. భారత విప్లవ వేగుచుక్క కామ్రేడ్ భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా పిడిఎస్‌యూ, పివైఎల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా పిడిఎస్ యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నామాల ఆజాద్ పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకు విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని విమర్శించారు. స్వదేశంలో కూడా ఆదాని, అంబానీ, టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు విశ్వవిద్యాలయాలు పెట్టుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని విమర్శించారు. విద్యను కాషాయీకరణ వైపు తీసుకువెళుతుందన్నారు. శాస్త్రీయమైన ఆలోచనలను దూరం చేసేందుకు విద్యార్థుల మెదళ్లలో మత భావాలతో కూడిన పాఠ్యాంశాలను జాతీయ నూతన విద్యా విధానం పేరుతోను తీసుకొస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణలను వ్యతిరేకించాలని భగత్ సింగ్ చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని వారు దుయ్యబట్టారు. నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేసిన బిజెపి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చారు.

తెయూ ప్రొఫెసర్ డాక్టర్ పున్నయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని వారు ప్రశ్నించారు. విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించకుండా, ఫెలోషిప్స్ విడుదల చేయకుండా, ఖాళీలు భర్తీ చేయకుండా ప్రభుత్వ విశ్వవిద్యలయాలపై కేంద్ర ప్రభుత్వం అక్కసుతో కూడిన దాడికి పాల్పడుతున్నారన్నారు. టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దత్తహరి మాట్లాడుతూ యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై విద్యార్థులు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. సదస్సుకు పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ అధ్యక్షత వహించారు.

ఈ సభలో పివైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనీష్, నవీన్, పిడిఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్,కోశాధికారి నిఖిల్, నాయకులు మమత, మహేష్, అజయ్,ముస్తాఫ విద్యార్థులు పాల్గొన్నారు.



అన్వేష్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల/ముప్కాల్

రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై మొట్టమొదటి సారిగా ఆయన స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా కిసాన్ కాంగ్రేస్ రాష్ట్ర నాయకులు అన్వేష్ రెడ్డిని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిసి శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అన్వేష్ రెడ్డి మరెన్నో ఉన్నతమైన పదవులను అధిరోహించి, ప్రజలకు సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, కాంగ్రెస్ నాయకులు బద్దం లింగారెడ్డి, కురాకుల బొర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ అన్వేష్ రెడ్డి రైతుల కోసం చేసిన కృషికి 'రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్' చైర్మన్ పదవి దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు. ముందు మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. అన్వేష్ రెడ్డిని కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, జిల్లా రైతు నాయకులు ఏలేటి మల్లారెడ్డి ఉన్నారు.



అన్వేష్‌రెడ్డిని సన్మానించిన ఏర్గట్ల మండల నాయకులు

ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇప్ప వెంకటరమణకు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వెంకటరమణను సన్మానిస్తున్న పలువురు

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇప్ప వెంకటరమణ కి శుక్రవారం జరిగిన వైవా -ఓస్ కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ నసీం పర్యవేక్షణలో ఇప్ప వెంకటరమణ "సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ డ్రగ్ లోడెడ్ పాలిమెరిక్ మ్యాట్రిక్స్ ఎన్కాప్సిలేటెడ్ విత్ నానో పార్టికల్స్ ఫర్ డ్రగ్ డెలివరీ అండ్ ఫార్మసిటికల్ అప్లికేషన్స్" అనే అంశంపై పరిశోధక గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటీ కీ సమర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రామచందర్ ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. తన పరిశోధనలో సాంప్రదాయ ఔషధం పంపే విధానం ద్వారా ఒక ఔషధం రోజుకు మూడు లేదా నాలుగు టాబ్లెట్స్ తీసుకోవడం జరుగుతుందని, దీని ద్వారా దుష్ప్రభావాలు మనిషిపై ఎక్కువగా ఉంటున్నాయి కావున ఈ దుష్ప్రభావాలను తగ్గించడానికి ఈ పరిశోధన ఎక్కువగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా రోజుకు మూడు లేదా నాలుగు టాబ్లెట్స్ ను ఉపయోగించుటకు బదులుగా ఒకసారి మాత్రమే టాబ్లెట్స్ తీసుకోవడం వల్ల 14 లేదా 16 గంటల వరకు క్రియాశీలకంగా పనిచేయునని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పరిశోధన ఫలితాలపై ఎక్సమినార్స్, తెలంగాణ యూనివర్సిటీ అధికారులు సంతృప్తి చెంది ఆయనకు డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి పరిశోధక విద్యార్థికి డాక్టరేట్‌ను పొందినందుకు అభినందించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ సత్యనారాయణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి చేస్తా

- నూతన మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వన్నెల దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ శుక్రవారం నవ తెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

పట్టణంలో నెలకొన్న సమస్యలపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారు..? రాజకీయాలకు మీరు కొత్త కదా?

ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధుల, అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. 2020 నుండి కౌన్సిలర్‌గా, భర్త అయ్యప్ప శ్రీనివాస్ సూచనలు సలహాల మేరకు పనిచేస్తున్నాను.

పలు వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.. ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ల సమన్వయంతో ఏఏ వార్డుల్లో సమస్యలు ఉన్నాయో తెలుసుకొని పరిష్కరించే దిశగా కృషి చేస్తా.



పట్టణంలో సొంత ఇండ్లు లేని నిరుపేదలు అద్దె ఇళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు?

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి సూచనలు, సలహాల మేరకు ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి వారి సమస్యలు పరిష్కరిస్తాం

మహిళల సంక్షేమంపై మీ అభిప్రాయం?

ప్రభుత్వం మహిళలకు టీఎస్ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించింది. .ప్రభుత్వం అందించే పథకాలను అందించి మహిళల సంక్షేమానికి మహిళాభ్యున్నతికి కృషి చేస్తాను.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా తెడ్డు నర్సయ్య

నవతెలంగాణ-ఆర్మూర్

అడ్వకేట్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఎన్నికలు ఉపసంహరణ గడువు శుక్రవారంతో ముగిసింది. అధ్యక్ష పదవికి మద్దేపల్లి మోహన్, చిల్కా సుభాష్, ప్రధాన కార్యదర్శికి రాజ్ కుమార్ బొల్లారం,సంయుక్త కార్యదర్శికి మద్దుల గంగారాం నామినేషన్ పత్రాలను ఉపసంహరణ చేశారు. అధ్యక్ష పదవికి తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్ష పదవికి పొడేటి శంకర్, ప్రధాన కార్యదర్శికి దేవరిశెట్టి అరుణ్, సంయుక్త కార్యదర్శికి సింధుకర్ చరణ్, కోశాధికారికి తుమ్మ సుకేష్, గ్రంథాలయ కార్యదర్శికి సురా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ళ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తులసి దాస్ క్రాంతి, కృష్ణ పండిత్, చిల్కా కిష్టయ్య, క్రిష్ణం రాజు, ఐనారి అశోక్, ప్రవీణ్ కుమార్, టికె కోనేరు బుట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రభుత్వ శాఖల్లో పురుష ఉద్యోగులకు ఏమాత్రం తక్కువ కాకుండా మహిళా ఉద్యోగులు సైతం సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని టీఎన్జీవోఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించి, ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా ఉద్యోగులు విధులను నిర్వర్తిస్తూనే, మరోపక్క ఇంటి పనులు, కుటుంబ బాధ్యతలను కూడా చక్కబెడుతున్నారని, నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. అయితే మహిళలు తమ ఇంటిని చక్కదిద్దినట్లే సమాజ మార్పునకు కూడా దోహదపడాలని కలెక్టర్ హితవు పలికారు. ఇంకనూ సమాజంలో మహిళల పట్ల ఒకింత వివక్ష కనిపిస్తుందని, ఇది దూరం కావాలంటే మహిళలే క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి తల్లి తమ పిల్లలను ఆడ, మగ అనే భేదం లేకుండా సమాన దృక్పథంతో సమ ప్రాధాన్యత చూపాలని హితవు పలికారు. సమ భావన వల్ల పురుషులు కూడా మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉంటారని అన్నారు. చిన్ననాటి నుండే బాలికలలో ఆత్మస్థైర్యం పెంపొందిస్తూ, వారిని మానసికంగా దృఢత్వం కలిగి ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యాలయాలలో, పని ప్రదేశాలలో ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్, కార్యదర్శి ఎం.నాగరాజు, జిల్లా సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి శేఖర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, జిల్లా సాంఘీక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ, మహిళా ఉద్యోగులు, టీఎన్జీవోల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులకు సన్మానించిన కలెక్టర్, తదితరులు

పిల్లల్లో ఏదో ఒక కళ ఉండడం సహజం

సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ జీపీవీ కుమార్



మాట్లాడుతున్న సైకాలజిస్ట్, పాల్గొన్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-ముప్కాల్

పిల్లల పెంపకం-ఒక కళ అనే అంశంపై ముప్కాల్ కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులకు సెమినార్ నిర్వహించారు. జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ జీపివి.కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో ఏదో ఒక కళ ఉండడం సహజమన్నారు. పిల్లల పెంపకంపై పలు విషయాలను వివరించారు. మరొక ముఖ్య వక్త, కృష్ణవేణి ఉన్నత పాఠశాల జోనల్ ఇంచార్జ్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన అనతి కాలంలోనే విద్యార్థుల సంఖ్యను పెంపొందించుకుని, విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలను పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. వచ్చే విద్యాసంవత్సరం 9వ తరగతి ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్, వేల్పూర్ కేటీఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ పులి శ్రీనివాస్, డైరెక్టర్లు ధర్మపురి, నర్సయ్య, రాజేందర్, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

తపాలా శాఖ మెగా మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కోటార్మూర్‌లో శుక్రవారం తపాలా శాఖ నిర్వహించిన మెగా మేళా కార్యక్రమంలో ప్రజల విశేష స్పందన కనిపించింది. ఈ కార్యక్రమాన్ని ఉదయం ఏఎస్పీ భూమన్న మెయిల్ ఓవారిస్ చంద్రశేఖర్, దశరత్ కార్యక్రమాన్ని ప్రారంభించి టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ పాలసీలను అధిక సంఖ్యలో చేయించారు. ఒకరితో ఒకరు విశేషమైన ప్రచారం ద్వారా అధిక సంఖ్యలో వచ్చి ఇన్సూరెన్స్ పాలసీలను చేయించుకోవడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆలూర్ బీపీఎం శ్రీనివాస్, మునిపల్లి బీపీఎం జగదీశ్వర్, అంకాపూర్ బీపీఎం రవికుమార్, చేపూర్ బీపీఎం భరత్ కుమార్, అర్గుల్, బీపిఎం సృజన, గోవింద్ పేట్ బీపిఎం రవళి, మామిడిపల్లి బిపిఎం భావన, పిప్రి బీపీఎం వెంకటేష్, ఏబీపీఎంలు పడాల భూషణ్, మృదుల, కావ్య, రాము పాల్గొన్నారు.

రామారెడ్డి కాంగ్రెస్ మండలాధ్యక్షునిగా లక్ష్మాగౌడ్



నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి కాంగ్రెస్ మండలాధ్యక్షునిగా రామారెడ్డి గ్రామానికి చెందిన గొల్లపల్లి లక్ష్మాగౌడ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ ఆర్డర్ కాపీని విడుదల చేశారు. గతంలో పోసానిపేటకు చెందిన శీలసాగర్‌ను నియమించడంతో నాయకులు, కార్యకర్తలు విముఖత చూపటంతో అధిష్టానం పున:పరిశీలించి లక్ష్మాగౌడ్‌ను నియమించినట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సందర్భంగా లక్ష్మాగౌడ్‌ను నవతెలంగాణ సంప్రదించగా.. తనపై నమ్మకం ఉంచి, బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పెద్దలకు, అండగా నిలిచిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరిని కలుపుకొని కార్యక్రమాలు నిర్వహిస్తానని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలను, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని తెలిపారు.

ఎంపీ అభ్యర్థిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను బోధన్ మండల బీఆర్ఎస్ నాయకులు ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ బోధన్ మండల కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో అభ్యర్థి విజయానికి భారీ ఎత్తున ప్రచారం నిర్వహించి అత్యధిక మెజారిటీ సాధించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతు, గంగాధర్, భవానీపేట్ లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రభాకర్ ఉన్నారు.



బాజిరెడ్డి గోవర్ధన్‌తో పలువురు

ప్రతి రైతుకూ పరిహారం అందాలి

- వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గంలో మూడు మండలాల్లో అతిగా పంట నష్టం జరిగిందని మిగతా 3 మండలాల్లో పాక్షికంగా పంట నష్టం జరిగినట్లు కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందేలా చూడాలని అన్నారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వెళ్లి ఏ రైతు, ఏ సర్వేనెంబర్ భూమిలో ఎంత పంట నష్టపోయాడో నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. మాచారెడ్డి మండలంలో 200ల ఎకరాలు, దోమకొండ మండలంలో 200 ఎకరాలు, భిక్కనూర్ మండలంలో 2300 ఎకరాలు, రాజంపేట్‌లో 200 ఎకరాలు, కామారెడ్డి మండలంలో 3500 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పంట నష్టం వివరాలను తీసుకోవాలని, కలెక్టర్‌తో సహా ఎవ్వరూ క్షేత్ర స్థాయిలోకి వెళ్ళడం లేదని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల విషయంలో ప్రజలకు, రైతులకు సహాయ కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ ఏమీ అడ్డు రాదని సూచించారు. గురువారం ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కామారెడ్డి నియోజకవర్గంలోని రైతులను పరామర్శించడానికి వస్తే ఆయన వెంట జిల్లా కలెక్టర్ లేకపోవడం సరికాదన్నారు. ఇన్చార్జి మంత్రి పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు పదివేల చొప్పున నష్టపరిహారం ఇస్తామనడం హర్షనీయమని, కానీ వారు చెప్పినట్టుగా పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిసిటీ అధికారులు పంట పొలాల్లో పడిపోయిన స్తంభాలు, ఇతర నష్టాలకు రైతుల నుంచి డబ్బులు తీసుకోకుండా త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేయాలని, రైతుల నుండి డబ్బులు అడగవద్దని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే

నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- డీఆర్డీఏ పిడి సాయగౌడ్



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ

నవతెలంగాణ-బోధన్

పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా రక్షణ పరమైన చర్యలు తీసుకోవాలని డి.ఆర్.డి.ఏ పీడి సాయగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బెల్లాల్ గ్రామంలో గల నర్సరీలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో ఎండిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో కూలీలకు లక్ష్యానికి అనుగుణంగా పనులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేష్ యాదవ్, ఈసీ అల్తాఫ్, డిఆర్‌డిఎస్ సిబ్బంది ఓమ్‌పాల్ తదితరులున్నారు .

అక్రమానికి లేదు అడ్డుకట్ట

- అక్రమంగా ఇసుక రవాణా
- మామూళ్ల మత్తులో అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మం డలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల పరిధిలోకి వచ్చే మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది. అందుకు నిదర్శనం పట్టపగలే లచ్చన్ గేట్ మీదుగా హైవే రోడ్డు గుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లే నిదర్శనం.



సర్కిల్‌లో ఇసుక ట్రాక్టర్లు

అక్రమ ఇసుకదారులు దినమైనా.. రాత్రయినా మంజీరా నది నుంచి బహిరంగంగానే ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అక్రమ దారులు సంబంధిత శాఖ అధికారులకు నెలవారి మామూళ్లు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పట్టపగలే ఇసుకను మద్నూర్, బిచ్కుంద మండలాలకు తరలిపోతుండగా రాత్రి తరలించే ఇసుక మన సరిహద్దు దాటి మహారాష్ట్రకు తరలి వెళ్తున్నట్లు జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా వివరణ కోరెందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అక్రమ ఇసుక రవాణకు అడ్డుకట్ట వేయాలని ఉమ్మడి మండల ప్రజలు కోరుతున్నారు.

ఒక్క చుక్కా వృథా చేయొద్దు

- జిల్లా భూగర్భ జలాల అధికారి సతీష్ యాదవ్
- నీటి వినియోగంపై కూలీలకు అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

ఒక్క నీటి చుక్కనూ వృథా చేయవద్దని జిల్లా భూగర్భ జలాల అధికారి సతీష్ యాదవ్ తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పోతాయిపల్లి అటవీ ప్రాంతంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. 'నేను నీటిని సంరక్షిస్తానని, పొదుపుగా వినియోగిస్తానని ప్రమాణం చేస్తున్నాను. నీటి వినియోగంలో ఔచిత్యాన్ని ప్రదర్శిస్తు, ఒక్క బొట్టు కూడా వృథా చేయనని ప్రతిజ్ఞ చేస్తున్నాను. జలనిధిని అత్యంత విలువైన పెన్నిధిగా భావించి, తదనుగుణంగా వినియోగిస్తానని, విజ్ఞత పాటిస్తూ తెలివిగా నీటిని వినియోగించుకోవడం, నీరు వృథా కాకుండా చూడటంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారిలో చైతన్యం తెస్తాను' అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపిఓ వీరేశం, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రాజు తదితరులు కూలీలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారి

దూప దీప నైవేద్య అర్చక సంఘంలో కామారెడ్డి వాసులకు చోటు

నవతెలంగాణ-కామారెడ్డి

ధూప దీప నైవేద్య ఎన్నికలను హైదరాబాద్ బ్రాహ్మణ పరిషత్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా వాసు దేవరావు శర్మ, ప్రధాన కార్యదర్శిగా అన్నవజ్జల ప్రసాద శర్మ ఎన్నిక అయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రమేష్ పూజారి, శీర్లవంచ కృష్ణమాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కేమ్రాజ్‌కల్లాలీ నుంచి సలాబత్‌పూర్ హనుమాన్ వరకు పాదయాత్ర

నవతెలంగాణ-జుక్కల్

శ్రీ అఖిలభారత హనుమాన్ దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక మహాపాదయాత్ర హనుమాన్ దీక్ష పీఠాధిపతులైన శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామి మంగళ శాసనాలతో మహాపాదయాత్ర 24న ఆదివారం జుక్కల్ మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ హనుమాన్ మందిర్ నుంచి సలాబత్ పూర్ (మిర్జాపూర్) హనుమాన్ మందిర్ వరకు ఉదయం 6 30 నిమిషాలకు ప్రారంభం కానుందని నిర్వాహకులు రమేష్ దేశాయి పేర్కొన్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ వారి పాదపూజ, ప్రవచనము, మహా అన్నదాన ప్రసాదం ఉంటుందని వివరించారు. కావున ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

గోలిలింగాల గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని గోలి లింగాల గ్రామంలో బాల వికాస్ సాంఘిక సేవ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందజేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ విట్టల్ తెలిపారు. గ్రామంలో సుమారు 220 పశువులకు టీకాలను అందజేసినట్టు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శశికళ, భీమ్‌రావు, సిబ్బంది నవీన్, లక్ష్మణ్, సావిత్రి, గోపాల్‌మిత్ర భాస్కర్‌గౌడ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో ఇంటి పన్ను వసూల్లు చేపట్టినట్టు గ్రామ కార్యదర్శి రాఘవేందర్ రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో 18 వేల రూపాయలు పన్నులు వసూలు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో కార్యదర్శులు శ్రీకాంత్, రాజు, వెంకటరమణ, సునీల్ యాదవ్, గిరి, ప్రవీణ్, కార్యవర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేసిన చిన్నారులు

- పలువురి అభినందన



చలివేంద్రం ఏర్పాటు చేసిన చిన్నారులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని దస్తగీర్ దర్గా వద్ద కొత్వాల్ గల్లీకి చెందిన మైనార్టీ చిన్నారులు శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రోజురోజుకు ఎండలు తీవ్రం కావడంతో వాహనదారులకు కాలినడకన వెళ్లే వారికి దప్పిక తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. చలివేంద్రం మరో మూడు నెలల పాటు కొనసాగిస్తామని ప్రజల దప్పిక తీర్చాలని ఉద్దేశంతో ఉచితంగా చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఆదివారం ప్రత్యేకంగా జ్యూస్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. చిన్నారులు కామ్రాన్, అతిక్, సమీర్, అఫ్రోజ్‌ను కాలనీవాసులు అభినందించారు.

ఓటర్లు ప్రలోభాలకు లోనుకావొద్దు

- ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నసురుల్లాబాద్ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామంలో గ్రామపంచాయతీ నుంచి వివిధ వాడలకు నడక ద్వారా ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. యువ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ఓటర్లను చైతన్యపరిచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాగయ్య, ఆర్ఐ హనుమండ్లు, గ్రామస్తులు సాయిలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాలనీల్లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లింగంపేట్‌లో జీడిమెట్ల పోలీసుల సోదాలు

- ద్విచక్ర వాహనాలు అమ్మిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో జీడిమెట్ల పోలీసులు శుక్రవారం ద్విచక్ర వాహనాలు విక్రయించేవారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన మన్నె రాజు గత కొన్ని రోజులుగా జీడిమెట్ల ప్రాంతంలో ఉంటూ ద్విచక్ర వాహనాలను అపహరించి లింగంపేట్ మండలంలోని బోనాల గ్రామానికి చెందిన శివకుమార్ గౌడ్ అనే ద్విచక్ర వాహనం మెకానిక్‌కు గత కొన్ని నెలలుగా విక్రయిస్తున్నాడు. జీడిమెట్ల ప్రాంతంలో గత కొన్ని నెలలుగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడంతో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు తమదైన శైలిలో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసే వ్యక్తుల గురించి ఆరా తీశారు. నిఘా ఏర్పాటు చేశారు. ఐలాపూర్ గ్రామానికి చెందిన మన్నె రాజు ద్విచక్రవాహనాలను అపహరిస్తూ విక్రయిస్తున్నాడని తేలడంతో శుక్రవారం జీడిమెట్ల పోలీసులు మఫ్టీలో ఐలాపూర్ గ్రామానికి చేరుకొని మన్నె రాజును అదుపులో తీసుకున్నారు. ఎన్ని వాహనాలు దొంగతనం చేశాడు?, ఎవరికి విక్రయించాడు? అని పోలీసులు ప్రశ్నించడంతో బోనాల గ్రామానికి చెందిన శివకుమార్‌గౌడ్ లింగంపేట్ మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న వ్యక్తికి విక్రయిస్తున్నట్టు చెప్పడంతో శివకుమార్ గౌడ్‌ను అదుపులో తీసుకున్నారు. ఎంతమందికి విక్రయించారు, ఎవరెవరి దగ్గర ఎన్ని బైకులు ఉన్నాయో వారి ఇండ్ల వద్దకు వెళ్లి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రెండు బొలేరాల్లో ద్విచక్ర వాహనాలను ఎక్కించి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జీడిమెట్ల పోలీసులు 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఐలపూర్ గ్రామానికి చెందిన మన్నే రాజు, బోనాల్ గ్రామానికి చెందిన శివ కుమార్ గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు తరలింపు

గర్భిణులకు పోషకాహారం ముఖ్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్/రామారెడ్డి

గర్భిణులకు పోషకాహారం ముఖ్యమని, పోషకాహారం లోపించకుండా ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని బొమ్మన్ దేవ్‌పల్లి గ్రామంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆడుతూ పాడుతూ నీతి కథలు వింటూ పాఠాలు నేర్చుకుంటున్నారని తెలిపారు. మూస విధానంతో కొనసాగే బోధనకు స్వస్తి పలుకుతూ చిన్నారుల్లో ఆలోచనలు రేకెత్తిస్తూ, మేధోశక్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. ఆహార పదార్థాలలో రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, కొర్రలు మొదలైనవన్నీ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రాసన, సామూహిక సీమంతాలు..

రామారెడ్డి : మండలంలోని రామారెడ్డి, రెడ్డిపేట్ గ్రామాల్లో అంగన్వాడీల ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు బాలింతలకు, గర్భిణీలకు, కిశోర బాలులకు పరిశుభ్రతపై, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్‌లో..

ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కిరణ్‌కు జోహార్లు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కిరణ్ అన్నకు విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన అనేక పోరాటాలు చేస్తూ, సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న ఆయన ప్రజాసేవనే ముఖ్యంగా ముందుకు సాగారని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి మృతిచెందిన కిరణన్నకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో పుట్టి నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, ఎస్.కె.నసీర్, రవి, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులుగా మల్లికార్జున్



నవతెలంగాణ-నిజాంసాగర్

కాంగ్రెస్ పార్టీ నూతన మండలాధ్యక్షునిగా మల్లికార్జున్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండలాధ్యక్షునిగా పదవి ఇచ్చినందుకు పార్టీకి ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన తెలిపారు. భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి, లోక్‌సభ అభ్యర్థి విజయానికి తన వంతు కృషి చేస్తానని మల్లికార్జున్ తెలిపారు.

క్షయను తరిమేద్దాం



క్షయ దినోత్సవంలో పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

క్షయను తరిమేద్దామని పలువురు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్‌బి.నగర్ పాఠశాలలో ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిబి సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ చంద్రకాంత్, ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అమృత రాజేందర్ మాట్లాడుతూ.. క్షయ రహిత భారత దేశంగా 2025 వరకు మనందరం కలిసి క్షయ వ్యాధిని దేశం నుంచి తరిమేద్దామని అన్నారు. క్షయ వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తిస్తే వ్యాధిని అదుపులో పెట్టవచ్చునని, క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో టిబి మందులు వాడితే క్షయను పూర్తిగా నయం చేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, ఏఎన్ఎం రాజనీత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, మంజుల, మమత విద్యార్థులు పాల్గొన్నారు.